ఎంపీపీ నిధులతో కుంటిభద్ర రోడ్ మరమ్మతులు

విశాలాంధ్ర-కొత్తూరు : మండలం గోతులతో అధ్వాన్నంగా ఉన్న కుంటిబద్ర గ్రామానికిగల ప్రధాన రహదారి మరమ్మతులకు ఎంపీపీ నిధులు రూ.ఐదు లక్షలు మంజూరు అయినాయి ఈ నిధులతో యుద్ద ప్రాతిపదికన సర్పంచ్ పావని రోడ్ మరమ్మతులు పూర్తి చేశారు గురువారం ఈ రోడ్‌ను ఎంపీపీ సవర సావిత్రి, వైస్ ఎంపీపీ లోతగెడ్డ తులసి వర ప్రసాదరావు పరిశీలించారు. అధ్వానంగా ఉన్న గ్రామ రహదారి మరమ్మతులకు ఎంపీపీ నిధులు సమకూర్చిన ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు కుంటిబద్ర ఎంపీటీసీ ఏ.సుశీల, సర్పంచ్ పావని, రంజిత్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.5 వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పలాస : పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన పోతనపల్లి కృష్ణారావు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న బొడ్డపాడు యువజన సంఘం సభ్యులు గురువారం శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారావు భార్యకు రూ.5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కృష్ణారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తామడ త్రిలోచన రావు, బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామడ క్రాంతి కుమార్, దాసరి శ్రీరాములు, తామాడ రామారావు, మద్దిల ధర్మారావు, బొడ్డు వల్లభరావు, బొడ్డు రవి, దున్న బాలకృష్ణ, కిక్కర ఢిల్లీరావు, ఈశ్వరరావులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-పలాస : పలాస మండలం బ్రాహ్మణతర్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పలాస విద్యుత్ శాఖ ఈఈ జి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కోసం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీని వలన బ్రాహ్మణ తర్లా, లక్ష్మీపురం, గరుడఖండి, అనంతగిరి, వెంకటాపురం, టెక్కలిపట్నం, కేశుపురం, బంటుకొత్తూరు, కేదారిపురం, పెదంచల, చినంచల, రాజగోపాలపురం, ఈదురాపల్లి, వీరభద్రాపురం, అమలకుడియా, పూర్ణభద్ర పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

దేవాదాయ భూమి ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణం శివారున కంచిలి వెళ్లే మెయిన్‌రోడ్డుకు ఆనుకుని దేవాదాయ, ధర్మదాయ శాఖకు చెందిన భూమి ఆక్రమణలపై సోంపేట ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాలాంధ్ర దినపత్రికలో మంగళవారం దేవాదాయ భూమిపై కబ్జాదారుల కన్ను శీర్షికన వెలువడిన కథనంపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్వే నెంబరు 212/4లో ఈ మండలం బేసి రామచంద్రాపురం గ్రామంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 40సెంట్ల భూమిని ఎటువంటి కౌలు ఆమోదం లేకుండాఅన్యాక్రాంతం చేయుటకు జింకిభద్రకు చెందిన వ్యక్తి అక్రమంగా ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తి వివరాలు తెలియపరుస్తూ ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ను కోరారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి

విశాలాంధ్ర-సోంపేట : మధ్యంతర భృతి వెంటనే ప్రకటిస్తూ ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని ఎపిటిఎఫ్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. 12వ పిఆర్‌సిని జూలై 23 నుంచి అమలు చేయాలని కోరారు. 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 75 ఏళ్లు పైబడిన వారికి పూర్తి పెన్షన్ వర్తింప జేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్ రాజేష్, చంద్రశేఖర్, గోవిందరావు, తిరుపతిరావు, కామరాజు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖలింగేశ్వర స్వామి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-జలుమూరు: శ్రీముఖలింగంలో ఉన్న శ్రీముఖలింగేశ్వర స్వామివారి హుండీలు గురువారం లెక్కించగా, 60 రోజులకు గాను రూ. 2,18,155లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పి ప్రభాకర రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ కార్యాలయం నుండి సినియర్ అసిస్టెంట్ జి.వి. బి.ఎస్. రవికుమార్, ఆలయ అర్చకులు అండ్ సిబ్బంది మరియు సత్య సాయి సేవా సంఘం వారు తదితరులు పాల్గొన్నారని ఆలయ ఈవో తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (257) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒక్క రోజ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల అపరిష్కృత సమస్యల పరిష్కారంలో వెనుకడుగు వేస్తుందని, తమపై ఉన్న ప్రభుత్వ మొండి వైఖరి విడనాడి తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుడు, ఉద్యోగులు, పెన్షనర్లు ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకు ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయ సూపరెండెంట్ ఆర్.మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కోటబొమ్మాళి మండల శాఖ అధ్యక్షులు వి. రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి యస్. మురళీధర్, రాష్ట్ర కౌన్సిలర్‌లు యన్.నీలామెహన్, యన్. శ్రీనివాసరావు, మండల ఉపాధ్యాక్షులు కె. ఉషారాణి, రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి, జలుమూరు మండల శాఖ అధ్యక్షులు ఎం. రామారావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రమణమూర్తి, రెండు మండలాల ఉపాధ్యాయులు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలి

విశాలాంధ్ర-పలాస : మార్చి16న నిర్వహించనున్న జాతీయ లోక్ అధాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ పడేవిదంగా చూడాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇంచార్జి న్యాయమూర్తి బిఎంఆర్ ప్రసన్నలత శాంతి భద్రతలు పరిరక్షించే విభాగం పోలీసులకు, ఎస్‌ఐబి పోలీసులకు, న్యాయవాదులకు సూచించారు. బుధవారం రాత్రి పోలీసులు, న్యాయవాదులు. కోర్టు సిబ్బందితో ఆమె పలాస కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ శ్రీకాకుళం అదేశాల మేరకు మార్చి 9వ తేది జాతీయ లోక్ అదాలత్ నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ ఆరోజు మహాశివరాత్రి పర్వదినం కావడంతో మార్చి16వ తేదిన లోక్‌అదాలత్ వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆరోజు నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో రాజీ కాబడిన క్రిమినల్, సివిల్ కేసులు పెద్ద సంఖ్యలో రాజీపడే విదంగా చూడాలని, రాజీయే రాజమార్గమని కక్షిదారులకు వివరించి వారి కేసులు రాజీపడే విదంగా వారికి నచ్చజెప్పాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో పోలీసులు, ఎస్‌ఐబి అధికారులు, కోర్టు సిబ్బంది. న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆర్ బి కె ద్వారా రైతుకు విస్తృత సేవలు

- నాడు-నేడుతో సర్వాంగ సుందరంగా పాఠశాల
- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస : రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. గురువారం మండలం కనుగులవలస గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. రూ.21.80 లక్షల అంచనాలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, సుమారు 31.75 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల భవనాలను స్పీకర్ తమ్మినేని ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఖరీఫ్, రబీ సీజన్లో రైతులకు మేలైన సాగుకు రైతు భరోసా కేంద్రాలు సాయంగా నిలుస్తున్నాయన్నారు. పంట ప్రారంభ కాలంలో విత్తనాలు,ఎరువులు వంటివి రైతులకు సబ్సిడీతో కూడిన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి గ్రామంలో నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల భవనాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న అన్నారు. విద్యా విధానంలో పెను మార్పులు జరిగాయన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు డిసిసిబి డైరెక్టర్ బోడ్డేపల్లి నారాయణరావు ఎంపీటీసీ పొన్నాడ అనసూయ మ్మ స్థానిక నాయకులు మండల సచివాల యాల కోఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు పొన్నాడ కృష్ణారావు బొడ్డేపల్లి అనిల్ పిఎసి ఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు సర్పంచులు గురుగుబెల్లి నీలారావు గోంటి కృష్ణ ఎన్ని రామచంద్రయ్య అప్పలనాయుడు కూటికుప్పల సన్యాసిరావు, తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-ఆమదాలవలస: సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ తయారీ తదితర అంశాలపై ఆముదాలవలస లోని స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూ న్ గురువారం పరిశీలించారు. ముందుగా తాసిల్దార్ కార్యాలయంలో రికార్డుల నిర్వ హణను పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమును సందర్శించు వివరాలు సేకరించారు. ఎన్నికల నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలి పారు. ఓటర్ జాబితా నిర్వహణ తీసు కోవలసిన చర్యలను వివరించారు. అనం తరం అర్బన్ హెల్త్ సెంటర్ ను, జొన్నవలస లోని సిహెచ్సి తనిఖీ చేశారు. వార్డుల్లో ఉన్న పేషెంట్లు, ఓ పి రిజిస్టర్ పరిశీలించే పరిస్థి తులను వైద్యాధికారిని అడిగి తెలుసుకు న్నారు. ఆన్లైన్ ఓపి విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. మందులు పేషెంట్లకు అందుబాటులో ఉన్నది లేనిది పరిశీలించారు. ఆయనతోపాటు మురళీధర నాయక్ రెవిన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్ ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థులు సామాజిక స్పృహతో ముందుకు సాగాలి

వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : విద్యార్థులు సామాజిక స్పృహతో ముందుకు సాగాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.ఆర్ రజిని అన్నారు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా వర్సిటీలో గురువారం నిర్వహించిన ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమంలో మంచి నడవడిక సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు మంచి ప్రవర్తనతో స్వగ్రామానికి వర్సిటీకి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రాజశేఖర్ రావు జిల్లా రిసోర్స్ పర్సన్ హెచ్ నాగభూషణరావు సూపర్వైజర్ ప్రసాదరావు తదితరులు మాట్లాడారు పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన చక్రపాణి కళాబృందం సభ్యులు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై చేసిన జానపద గేయాలు దృశ్యాలతో సభికులును ఆకట్టుకున్నాయి.

వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తగా చిట్టిబాబు

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తగా డాక్టర్ జి.చిట్టిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. రాగోలు ప్రధాన శాస్త్రవేత్త డా.పి.వి.సత్యనారాయణ ఇప్పటివరకు ఇన్చార్జి బాధ్యతలు వ్యవహ రించారు. డాక్టర్ ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం డా. చిట్టిబాబును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమదాలవలస ఏరువాక కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేసి, జిల్లా రైతులకు విస్తృత సేవలు అందిం చారు. అనంతరం జిల్లాల పునర్విభన నేప థ్యంలో భాగంగా ఏరువాక కేంద్రం, పాడెరుకు బదిలీ అయ్యారు. ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం డా.చిట్టిబాబును వ్యవసాయ పరిశోధన స్థానానికి అధిపతిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులకు విస్తృతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల సమస్యలపై సాంకేతిక సలహాలు అందించి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానని వివరించారు.

ఫీజుతో సంబంధం లేకుండా హాల్ టికెట్ ఇవ్వాలి

విశాలాంధ్ర-పలాస : కాలేజీ ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులకు పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి డిమాండ్ చేశారు. గురువారం పలాస సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిహెచ్ రవి మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలో ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్నాయన్నారు. ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్తున్నా, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యాలు ఆ అవకాశం ఇవ్వడం లేదన్నారు. ఇంటర్ బోర్డ్ అధికారులు తక్షణమే ఆయా కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ప్రత్యక్ష ఆందోళనకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. విద్యార్థులు ఎవరికైనా హాల్‌టికెట్ ఇవ్వకుండా యాజమాన్యాలు ఇబ్బంది పెడితే ఏఐఎస్ఎఫ్ నాయకులతో ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. 949075684, 6302869477 ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత దుస్తులను ప్రతి సోమవారం ధరించాలి

కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలి, జిల్లాలో ఉత్పత్తి చేయబడిన చేనేత దుస్తులను ధరించాలని కలెక్టర్ డా. మనజీర్ జీలాని సమూన్ తెలిపారు. చేనేత భారతదేశ సాంప్రదాయ కళ, సంస్కృతిని ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వము వారిచే వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద పొందూరు కాటన్ వస్త్రములు ఎంపిక కాబడినవి. నేడు ఈ ఆధునీకరణతో పోటీ పడుతూ శ్రీకాకుళం జిల్లా చేనేత ఉత్పత్తులు భారతదేశం మొత్తం ఆకర్షిస్తున్నవి, కావున ఇట్టి మన జిల్లా చేనేత ఉత్పత్తుల అభివృద్ధి కొరకు ఆప్కో కొత్త ఉత్పత్తులు, కొత్త డిజైన్‌లు, వాల్యూయాడెడ్ ప్రొడక్ట్‌లు, అవసరాలకు తగినట్లుగా రెడీమేడ్ వస్త్రాలు అందిస్తుందన్నారు. అలాగే ప్రత్యేకించి వివిధ మార్గాల్లో చేనేత బట్టల విస్తృత వినియోగం కోసం యువతను ఆకర్షించడానికి, ఏపీసీవో అన్ని ఉత్పత్తులపై 30శాతం తగ్గింపుతో విక్రయాలు చేస్తున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం జిల్లాలోని జిల్లా అధికారులు, డివిజనల్ అధికారులు, మండల స్థాయి అధికారులు వారి వారి కార్యాలయంలో వారి సబార్డినేట్ సిబ్బంది అందరూ ప్రతి సోమవారం శ్రీకాకుళం జిల్లాలో ఉత్పత్తి చేయబడిన చేనేత దుస్తులను ధరించడం ద్వారా చేనేత కార్మికుల జీవన స్థితిని మెరుగు పరుస్తుందన్నారు. కావున, ప్రభుత్వ ఉద్యోగు లందరూ ప్రతి సోమవారం చేనేత దుస్తులను ధరించాలని, తద్వారా చేనేత కార్మికుల మనోధైర్యాన్ని పెంపొందిస్తూ వారి ఉత్పత్తులను ప్రోత్సహించాలని తెలిపారు.

5 కోట్ల ఆంధ్రుల కోసమే జనసేనతో చేతులు కలిపాం

మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట : వైసిపి దొంగలకు వ్యతిరేకంగా టిడిపి-జనసేన పోరాడుతున్నాయని, రాష్ట్రంలో 5కోట్ల ఆంధ్రుల కోసమే టిడిపి, జనసేన పార్టీతో చేతులు కలిపిందని మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో రమణమూర్తి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, ప్రజలు టిడిపిపై వున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో సూపర్ సిక్స్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. టిడిపి హాయాంలో అన్న క్యాంటిన్లను పెట్టి రాష్ట్ర ప్రజల ఆకలి తీర్చామని, వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్యాంటిన్లను తీసి, రాష్ట్రాన్ని విధ్వంసం చేశారాన్నారు. రాష్ట్రంలో 175స్థానాల్లో గెలవాలని చెపుతున్న సిఎం, జగన్మోహన్‌రెడ్డి ఏం సాధించారని, జాబ్ క్యాలండర్ ఎక్కడ విడుదల చేశారని, డిఎస్సీ ఎక్కడ ప్రకటన చేశారని, ఉచిత ఇసుక ఎక్కడ అందించారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ధృక్పధంతో టిడిపి బ్లూ ప్రింట్ తీసిందని, ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథకాలు అందిస్తామని, రైతులకు సాగునీరు అందిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు, బలగ ప్రహర్ష, ప్రధాన కార్యదర్శి, గుర్రాల సుశాంత్‌కుమార్, టిడిపి నియోజకవర్గ అధ్యక్షులు, మెండ గౌరినాయుడు, తెలుగు యువత సభ్యులు, తంగి తారకేశ్వర్‌రావు, బొచ్చ జయరాం, ముద్దాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాగా పని చేయండి... గరిష్ఠ వేతనం పొందండి

డ్వామా పిడి జీవి చిట్టి రాజు

విశాలాంధ్ర-గార : ఉపాధి హామీ పథకం వేతన దారుడు బాగా పనిచేసి గరిష్ఠ వేతనం పొందాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవి చిట్టిరాజు కూలీలను కోరారు. గురువారం మండల పరిధి నిజామాబాద్ పంచాయతీలోని కర్రి చెరువు, శ్రీకూర్మం వద్ద జరుగుతున్న ఫార్మ్ పాండ్ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం కూలీలు పని ప్రదేశాల్లో రెండు పూటలా ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉందని, అయితే కనీసం 6 గంటల సమయం సమయపాలన పాటించి పనులు చేసినట్లయితే గరిష్ఠ వేతనాన్ని పొందవచ్చు అన్నారు. చేసిన పనికి కొలతల ప్రకారం వేతన చెల్లింపులు జరుగుతాయి అన్నారు. సొంత వ్యవసాయ పనులు చూసుకుంటూ ఉపాధి పనులు చేసుకునే వెసులుబాటు ఉందని, దీనిని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇక్కడ మీరే యజమానులని, ఉద్యోగు లందరూ మీకు సహాయకులుగా మాత్రమే ఉంటారని పేర్కొన్నారు. గ్రామాలలో సుస్థిర వనరులు సృష్టించుకోవలసిన బాధ్యత మీదేనని, చెరువులు, పంట కాలువలు పనులు చక్కగా చేసినట్లయితే నీటి నిల్వ సామర్థ్యం పెరగడం ద్వారా పంటలకు అవసరమైన నీరు సమృద్ధిగా లభించడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తులు దిగుమతి అవుతాయన్న ఆయన భూగర్భ జలాలు కూడా పెరగడం ద్వారా తాగునీటి ఇబ్బందులు కూడా తీరుతాయని తెలియజేశారు. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్క వేతనదారుడు 100 రోజులపాటు పనులకు రావాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో పిడి వెంట ఏపీవో శోభారాణి, ఈసీ నారన్నాయుడు, ఇతర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం పునరిద్ధరించాలి

జిల్లా గౌరవ అధ్యక్షులు, ఆదినారాయణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం వెంటనే పునరుద్ధరించాలని, లేని పక్షంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, ఎం.ఆదినారాయణ మూర్తి హెచ్చరించారు. గురువారం స్థానిక జట్టు కళాసీ యూనియన్ భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సంధర్భంగా గౌరవ అధ్యక్షులు, ఆదినారాయనమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిర్మాణ యజమానులు చెల్లించే సంక్షేమ నిధిని కార్మికుల సంక్షేమ పథకాల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి, తర్ల లక్ష్మణరావు మాట్లాడుతూ పెండింగ్ క్లైయిమ్‌లు వెంటనే పరిష్కారం చేయాలని, జిల్లాలో సుమారు 2లక్షల మంది నిర్మాణ కార్మికుల కుటుంబాలకు సంబందించిన సంక్షేమ చట్టం అమలును గత సెప్టెంబర్ 2020లో మెమో 1214జారీ చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందని తెలిపారు. దీని ఫలితంగా జిల్లాలో సుమారు 8వేల కార్మికులు క్లైయిమ్‌లను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం సాకులు చెపుతుందని విమర్శించారు. ఇతర అవసరాల కోసం సెస్ నిధిని ప్రభుత్వం మళ్ళించటం దుర్మార్గమైన చర్యని లక్ష్మణరావు దుయ్యబట్టారు. ఇప్పటికే కార్మికులు తీవ్ర అసంతృప్తితో వున్నారని, రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని హామీలను ప్రకటించి, అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.తేజేశ్వరరావు, శిమ్మ ఉమా, పైల రాము, వాన అప్పారావు, బోర సూర్యనారాయణ, వై.కామేశ్వరి, ఎల్.గణమ్మ, ఆర్.తౌడు, ఆర్.రాజారావు, జి.బువ్వాజీ, పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'బొడ్డేపల్లి'కి వైద్య సేవలో జాతీయ అవార్డు

పరిశోధనకు పేటెంట్ హక్కులు

విశాలాంధ్ర-పోలాకి: సాంకేతిక విభాగంలో వైద్య సేవలు విస్తృతంగా పొందచ్చని రుజువు చేయడంతో జాతీయ అవార్డు తన కుమారుడు డాక్టర్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్‌కి లభించినట్లు ప్రియాగ్రహారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామినాయుడు తెలిపారు. గురువారం తన పాఠశాల తరగతుల ప్రారంభం కార్యక్రమం, విశాలాంధ్రతో మాట్లాడారు. తన కుమారుడు ఆర్మీడ్ ఫోర్స్ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ (స్టూడెంట్ సెంట్రిక్ టీచింగ్ యాప్ ఫర్ మెడికల్ ప్రొఫెషనల్స్)వంటి పరిశోధనలో మేదేవల్ సిబిఎంఈ ఫిల్ వంటివి సాంకేతిక విభాగం ద్వారా వైద్య సేవలు విస్తృతంగా సౌకర్యం పొందుటకు పరిశోధనలో ఫలితం వచ్చిందని ఇందుకు భారత ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. చేపట్టిన పరిశోధనలు ఫలితం ఇవ్వడంతో భారత ప్రభుత్వం పేటెంట్ హక్కులు కల్పించిందని చెప్పారు. డాక్టర్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ ఎండికు అందజేసిన అవార్డు 72వ ఆవిష్కర్ 2024 ఆర్మీడ్ ఫోర్స్ మెడికల్ కాలేజీ పూణేలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ అండ్ ఆర్మీడ్ మెడికల్ ఫోర్సు వారు ఆధ్వర్యంలో అవార్డు అందజేసినట్లు చెప్పారు. అసోసియేట్ ప్రొఫెసర్ విభాగంలో తన భార్య సుధారాణి కూడా ఎండిగా సేవలు అందజేస్తున్నట్లు చెప్పారు.భారత ప్రభుత్వం అందజేసిన అవార్డుతో పాటు పేటెంట్ హక్కులు లభించడం పట్ల చాలా సంతోషంగా ఉందని ప్రధానోపాధ్యాయులు రామినాయుడు తెలిపారు. దేశస్థాయిలో రక్షణ విభాగంలో వైద్య సేవలు అందిస్తున్న పూర్వపు విద్యార్థి బొడ్డేపల్లి దుర్గాప్రసాద్‌కు ప్రగతి స్కూల్ వ్యవస్థాపకులు ఇలపండ గణపతిరావు శుభాకాంక్షలు తెలిపారు. తమ సంస్థ ద్వారా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన విద్యార్థులలో మొదటి వరుసలో ఉన్నట్లు సంతోషం వ్యక్తం చేశారు. వైద్య సేవలో విశేష సేవలు అందించిన డాక్టర్ దుర్గాప్రసాద్ విజయం పట్ల స్థానిక సర్పంచ్ బెవర నూకరాజు మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు సామాజిక సేవకుడు దుబ్బ కోటేశ్వరరావు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తాడేపల్లి సభతో వైసీపీ గుండెల్లో రైళ్లు

టీడీపీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర-అరసవల్లి : తాడేపల్లిలో జరిగిన టిడిపి-జనసేన జెండా సభతో వైకాపా పాలకుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సభ కోట్లాది మంది ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇచ్చిందన్నారు. తాడేపల్లి సభ ప్రజా అజెండా అని అన్నారు. వైకాపా దొంగలకు వ్యతిరేకంగా టిడిపి, జనసేన పోరాడుతున్నారు. టీడీపీ జనసేన చేతులు కలిపింది మా వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం కాదదని, ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం చేతులు కలిపామని రవికుమార్ గుర్తు చేశారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి ఇదన్నారు. జగన్ రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్లారని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అన్నా క్యాంటీన్లు తెరిచి పేదలకు రూ.5తో భోజనం పెడితే జగన్ రెడ్డి వాటిని మూయించారన్నారు. కరోనా సమయంలో ఫేస్ మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడిగా ముద్రవేసి చంపారర్నారు. వైకాపా వేధింపులు వేధింపులు భరించ లేక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహారి పారిపోయాడని రవి కుమార్ గుర్తు చేశారు. వైకాపా పాలనలో జగన్రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. రానున్న ఎన్నికల్లో పులివెందులలో జగన్ రెడ్డికి ఓటమి తప్పదదన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం సూపర్-6ను టిడిపి అధినేత ప్రవేశపెట్టారన్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సొమ్ము దోచుకోకుండా సంక్షేమ పథి కాలు అమలు చేస్తామన్నారు. సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని రవికుమార్ వెల్లడించారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, పాలన ద్వారా సంపాదించిన సొమ్మును పేదలకు అంద జేస్తామని రవికుమార్ స్పష్టం చేశారు.

అశోక్ బాబును మరో మారు ఆశీర్వదించండి : ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల

విశాలాంధ్ర-కవిటి : ఇచ్చాపురం నియోజకవర్గం నుండి ముచ్చటగా మూడోసారి తెలుగుదేశం పార్టీ తరఫున బరిలోకి దిగుతున్న ఎమ్మెల్యే బెందాలం అశోక్‌ను మరో మారు ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని నెలవంక పంచాయతీలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మూడోసారి డాక్టర్ బెందాళం అశోక్ టికెట్ ప్రకటించినందుకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు కొమ్ముపొట్టుగ, మధ్యపుట్టుగ, బైరెడ్ల పుట్టుగ, కోరికాన పుట్టుగ, బదకలపుట్టుగ, సీమూరు, నెలవంక గ్రామంలలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు నాయుడు పరిపాలనకు జగన్ పరిపాలనకి మధ్య వ్యత్యాసం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో గల మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తెలుగుదేశం విజయానికి సహకారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బెందాలం తిరుమల,బెందాలం విజయ్ కృష్ణ, బార్ల చినబాబు, మణి చంద్రప్రకాష్, ప్రగడ మణిబాబు, రంగారావు, బల్లెడ శ్రీపతి, రొయ్యి భాగ్యశ్రీ, నెలవంక గ్రామ పంచాయతీలో పెద్దలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు, కవిటి మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, వివిధ అనుబంధ సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

64వ రోజుకు చేరుకున్న బెంతో ఒరియా నిరాహార దీక్ష

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రంలో బెంతో ఒరియా సామాజిక వర్గం చేస్తున్న రిలే నిరాహార దీక్ష 64వ రోజుకు చేరుకుంది. సందర్భంగా గురువారం రిలే నిరాహార దీక్షలో సంఘీభావంగా ఉత్తరాంధ్ర పట్టభద్రులు నియోజక వర్గ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ పూడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి విద్యా రంగంలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు దృష్ట్యా వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బెంతో ఒరియా యూత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సుమన్ బిసాయి, దుదిష్టి మజ్జి, సలహాదారు ప్రేమ్ కుమార్, శంకర్ సాహు, జయశేన్ బిసాయి, కృష్ణ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడు సమక్షంలో వైకాపా నుండి టీడీపీలోకి ....

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: రాష్ట్ర తెదేపా అధ్యక్షులు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి మండలం మేఘవరం పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్య కర్తలు, వార్డు మెంబర్లు టిడిపిలో చేరారు వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికిలో మేఘవరం పంచాయతీ మాజీ సర్పంచ్ అల్లు మాధవరావు, 5వ వార్డు మెంబరు అల్లు వెంకటరావు, మాజీ వార్డు మెంబరు గుంజల గోపీనాథ్, మాజీ ఉపసర్పంచ్ గుంట తవిటయ్య, జెన్ని చంద్రరావు, గూన రాఘవరావు, గురుగుబల్లి సూర్యనారాయణ, జెన్ని శ్రీరామ్, చింతాడ శ్రీనివాసరావు, లంబ భీమారావు, జెన్ని భీమారావు, మాజీ గ్రామ వాలంటీరు బమ్మిడి ఫల్గుణరావులతో పాటు 70 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామాల అభివృద్ధి చేసుకోవాలంటే అచ్చెన్నాయుడుతోనే సాధ్యమని అందుకే ఆయన నాయకత్వంలో పనిచేయాలని ముందుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, టిడిపి నాయకుడు సంబాళ రాజశేఖర్‌లతో పాటు ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ... మన ఎమ్మెల్యేలు

పాతపట్నం నియోజకవర్గం.. 5 సార్లు ఎమ్మెల్యే కలమట రికార్డ్

విశాలాంధ్ర-కొత్తూరు : శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజక వర్గానికి ఒక రాజకీయ ప్రత్యేకత ఉంది.ఇక్కడ నుండి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఘనత కలమట మోహన్ రావుకె దక్కింది. 1978 ఎన్నికల్లో కలమట మోహనరావు ఇండిపెండెంట్‌గా పోటీచేసి జనతా పార్టీ అభ్యర్థిలు కలాపు లక్షణదాస్ నాయుడుపై విజయం సాధించి తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు, కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం 1989 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలోచేరి ఆపార్టీ అభ్యర్థిగా 1989, 1894, 1999, 2004 ఎన్నికల్లో వరుసుగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు మొత్తం ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. ఈ రికార్డ్‌ను ఇంతవరకు పాతపట్నం నియోజిక వర్గంలో ఎవరు అధిగమించలేదు కాగా అభివృద్ధి విషయానికొస్తే ఎమ్మెల్యేగా కలమట హయాంలో మారుమూల గ్రామాలకు పక్కా రహదారుల నిర్మాణాలు బాగా జరిగాయి, వీధుల్లో సిమెంట్ రోడ్లు వెలిశాయి, మండల కేంద్రాల్లో ఆర్టీసి కాంప్లెక్స్‌ల నిర్మాణాలు జరిగాయి. కొత్తూరు మండలం మాతల నివగాంల మధ్య వంశధార నదిపై వంతెన నిర్మాణం ఎమ్మెల్యేగా కలమట హాయంలోనే జరిగింది. ఆంధ్రా-ఒరిస్సాలకు వారధి ఈ వంతెన ఇక ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన కలమట నీతినిజాయితీగల నాయకులు అవినీతి మరకలు అంటని నేతగా ఆయన రాజకీయ ప్రత్యర్థులు కూడా చెప్పుకుంటారు. ఇక చివర అంశం ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే కలమట మోహనరావు రాజకీయాలకు దూరంగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

రామకృష్ణారెడ్డి మృతికి సంతాపం

విశాలాంధ్ర-పలాస : హైదరాబాద్‌కు చెందిన నవ్య ప్రింటర్స్ అధినేత, పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య భర్త రామకృష్ణ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం పట్ల సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు సంతాపం తెలిపారు. పలాసలో గురువారం పార్టీ కార్యాలయం సూది కొండలో ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన జయక్క పుస్తకం ముద్రణలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. విప్లవ సాహిత్యం ముద్రిస్తున్నారని ప్రింటింగ్ ప్రెస్ పైన, పిఓడబ్ల్యు జాతీయ అధ్యక్షురాలు సంధ్య పై ప్రభుత్వాలు దాడులు చేశారని గుర్తు చేశారు. రామకృష్ణారెడ్డి జీవిత సహచరిగా సంధ్య రాజకీయ ఎదుగుదల వెనుక ఆయన కృషి ఉందన్నారు. ఆమెపై ఊపా చట్టం పెట్టినప్పుడు నిర్బంధం ప్రయోగించినప్పుడు ఆమెకు అండగా నిలబడ్డారన్నారు. విప్లవాన్ని ప్రేమించిన రామకృష్ణారెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు నష్టదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జుత్తు వీరాస్వామి ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ ,ఎం వినోద్ పిడిఎస్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మామిడి భీమారావు ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు, బతకల ఈశ్వరమ్మ జిల్లా అధ్యక్షురాలు, సరస్వతి, కె.సోమేశ్వర రావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి బి కూర్మారావు, వి.పాపయ్య జె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య దశ నుండే దేశభక్తిని అలవరుచుకోవాలి

విద్యాభారతి అఖిల భారతీయ కార్యకరినీ సభ్యులు కాశీపతి

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థులు బాల్య దశ నుండే దేశభక్తిని అలవరుచుకోవాలి విద్యా భారతి అఖిల భారతీయ కార్యకరినీ సభ్యులు జె.యం.కాశీపతి అన్నారు. ఈమేరకు గురువారం కే.కొత్తూరు భారతీయ విద్యా కేంద్రం వారి ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల కేంద్రంగా నిర్వహిస్తున్న బట్టివాణిపాలెం సేవా పాఠశాలను విద్యా భారతి అఖిల భారతీయ కార్యకరినీ సభ్యులు జే ఎం కాశీపతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కృత్యాలు చేయించారు. బాల్యం నుంచి దేశభక్తిని విద్యార్థులలో అలవాటు చేయాలని, భారతీయ విద్యాకేంద్రం పాఠశాలలు ఆ దిశగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో బి.వి.కె కోశాధికారి వై.శ్రీధర్, డి.ఓ, వి.కృష్ణమోహన్, డి.రాజశేఖర్, ప్రధాన ఆచార్య ఎం.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కెరీర్‌కు పైలట్ ప్రాజెక్టులు ఎంతో అవసరం

విశాలాంధ్ర -కోటబొమ్మాళి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు సరియైన కెరీర్ ఎంచుకోవటానికి పైలట్ ప్రాజెక్టులు ఎంతో ఉ వ యొ గ వ డ తా య ని ఉపాధ్యాయులు షణ్ముఖరావు అన్నారు. మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులను గురువారం కెరీర్ విజిట్స్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సచివాలయాలను గైడ్ టీచర్ షణ్ముఖ మాస్టర్ తో సందర్శించి అక్కడ పనిచేస్తున్న వివిధ కెరీర్స్‌ను పరిశీలించి వారి విద్యార్హతలు, పనులు, జీతభత్యాలు, పదోన్నతి క్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, యూనిసెఫ్ సౌజన్యంతో శ్రీకాకుళం జిల్లాలో కోటబొమ్మాళి, పోలాకి, లావేరు మండలాలలో ఈ విద్యా సంవత్సరంలో 9వ తరగతికి కెరీర్ గైడెన్స్ పై పిల్లలకు వివిధ మనోమాపన పరీక్షలు నిర్వహించి వారికి సరియైన కెరీర్‌ను ఎంచుకోవడానికి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. దీనిలో భాగంగా ప్రాథమిక వైద్యశాల మెడికల్ ఆఫీసర్ ఎన్. వరుణ్, హెల్త్ ఎడ్యుకేటర్ చిన్నతల్లి, గుణసుందరి, సిబ్బందిలను వారివారి కెరీర్స్ గురించి పిల్లలకు వివరించారు. అలాగే రామక్రిష్ణ పురం సచివాలయం సిబ్బంది మోహనరావు, హాసిని, జయలక్ష్మి వారి కెరీర్స్ గురించి వివరించారు. పిల్లలు ఈ సందర్శన ఒక కొత్త అనుభూతి ఇచ్చింది అని హర్షం వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో సంతబొమ్మాళి ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆపాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు, ఉపాధ్యాయులు లఖినాన వెంకట రమణ తెలిపారు. ఇటీవల సారవకోట మండలం మదనాపురం పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో 56 టీమ్‌లు పాల్గొనగా, మా విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. కొన్న కళ్యాణి, కొన్న లోహిత్, ముద్దాడ రేవంత్, చెట్టు రవికుమార్‌లకు 2222 రూపాయల నగదు, షీల్డ్ మరియు సర్టిఫికెట్లు సారవకోట మండల ఎంఈఓ వెంకటరమణ మరియు భూలక్ష్మి అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మరియు ప్రధానోపాధ్యాయులు అంగూరు రామారావు, ఉపాధ్యాయులు లఖినాన వెంకటరమణ, సనపల నరసింహమూర్తి, హరి ప్రసాద్, మయూరి, కానూరు ఆనందరావు, సిమ్మన్న, భవాని, రోజా రమణి, రజిని, పాలిన సుధా కృష్ణ పావని విద్యార్థులకు .సంతబొమ్మాళి మండల విద్యాశాఖ అధికారులు జే.చిన్నవాడు, డి.అర్జునుడు అభినందించారు.

మార్చి 16న లోక్ అదాలత్

విశాలాంధ్ర-సోంపేట : మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ మార్చి 16వ తేదీకి వాయిదా పడినట్లు మండల న్యాయసేవాసంస్థ అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ తగాదాలు, అలాగే రాజీ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

బాతుపురంలో గ్రామ ముఖద్వారం ప్రారంభం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : బాతుపురంలో బత్తిన దానేసు జ్ఞాపకార్థం ఆయన సతీమణి బత్తిన దమయంతి ఆర్థిక సహాయంతో నిర్మించిన గ్రామ ముఖద్వారం గురువారం వేదమంత్రాల సాక్షిగా ప్రారంభోత్సవం చేసారు. ఇప్పటికే వారు పాలపోలమ్మ అమ్మవారి ముఖద్వారం, నందెన్న మేడ, మంకినమ్మ తల్లి గుడి, రావి చెట్టు చుట్టూ మండపం నిర్మించారు. మహిళలు, భక్తులు ముఖద్వారం, సమీపంలోని ఆంజనేయ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తామాడ సురేష్, గ్రామ పెద్దలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పార్టీల నాయకులతో తహసీల్దార్ సమావేశం

విశాలాంధ్ర-హిరమండలం : వివిధ రాజకీయ పార్టీ నాయకులతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుధాకర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కళ్లట పోలింగు కేంద్రం నుండి జిల్లేడుపేటకి చెందిన 277 ఓట్లు తో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయుటకు గాను అక్కరాపల్లి పోలింగు కేంద్రం నుండి అంతకాపల్లి ఇప్పగూడకి చెందిన 143 ఓటర్లు తో అంతకాపల్లి పోలింగు కేంద్రం ఏర్పాటు చేయుటకుగాను చర్చించామన్నారు. డీటీ బి.వెంకట్‌రమణ జడ్పీటీసీ పి బుచ్చి బాబు, లాయర్ అప్పారావు, బి శ్రీధర్, బి.ధర్మారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

జింకిభద్ర నుంచి మెయిన్‌రోడ్డుకి కొత్తరోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం జింకిభద్ర నుంచి పాతచెరువు, స్మశానం మీదుగా సోంపేట-బారువ మెయిన్‌రోడ్డుకు కలిపేలా కొత్త సిమెంట్ రహదారికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు గురువారం శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు 7లక్షల రూపాయలతో ఈ రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో తామాడ శేఖర్, వైస్ సర్పంచ్ సాహుకారి జాని, పెద్దకోట ఆనంద్, తామాడ సూరి, ఎన్ని అజయ్, బత్తుల శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పిసిసి అధ్యక్షురాలిని కలిసిన రాంబాబు

విశాలాంధ్ర -హిరమండలం/పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ని పాతపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వకర్త చుక్క రాంబాబు గురువారం విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గం యొక్క స్థితిగతులు పరిస్థితులు రాజకీయ సమీకరణాలు చర్చిస్తూ పాతపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వగలరని ఇస్తే ఖచ్చితంగా పార్టీ బలోపేతం కోసం కృషిచేసి పోటీలో గెలవడానికి ప్రయత్నిస్తానని షర్మిలరెడ్డితో మాట్లాడి వివరించడం జరిగిందని చుక్క రాంబాబు విలేకరుల కు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందిస్తూ పార్టీ కోసం పనిచేయండి మీకు మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

యోగా జీవన ప్రక్రియలో భాగం కావాలి

విశాలాంధ్ర-ఎచ్చర్ల : జీవితంలో యోగ జీవన ప్రక్రియ కావాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిజిడి బాలాజీ అన్నారు క్యాంపస్ లో నూతన యోగ హాలును గురువారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు ప్రతిరోజు యోగాసనాలు ప్రాణయామం చేయడం వల్ల మానసిక ప్రశాంతత వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది అన్నారు క్యాంపస్ వైద్యురాలు అరుణ బాలాజీ మాట్లాడుతూ ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల ప్రయోజనాన్ని వివరించారు డీన్ కొర్ల మోహన్ కృష్ణ చౌదరి వెల్ఫేరి డీయన్ గేదెల రవి ఫైనాన్స్ ఆఫీసర్ నాయుడు విభాగాధిపతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

- అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేసిన ఏపీ సర్పంచ్‌ల సంఘం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : సర్పంచ్‌ల న్యాయబద్దమైన 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించేవిధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్, వి. లక్ష్మీముల్యాలరావు, అనకాపల్లి జిల్లా పంచాయతీల సంఘం అధ్యక్షులు చింతకాయల సూజత ముత్యాలు గురువారం స్థానిక టిడిపి కార్యా లయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుకు సర్పంచ్‌లతో కలిసి వినతి పత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాలుగా మా గ్రామాలలో అభివృద్ధి పనులు ఏమీ చేయలేక రోడ్లు, డ్రెయిన్స్, త్రాగునీరు, వీధి దీపాలు ప్రజలకు సమకూర్చలేక సర్పంచ్‌లం ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని, ఓట్లు వేసిన ప్రజలు మమ్ములను తిడుతున్నా ఏమీ చేయలేకపోతున్నా మన్నారు. దీనికి కారణం ప్రభుత్వం మా గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సి వాటా నిధులు ఇవ్వకపోగా మా స్థానిక ఆదాయ వనరులు ద్వారా వచ్చే మా స్వంత నిధులను మరియు కేంద్ర ప్రభుత్వం మా గ్రామాల అభివృద్ధి కోసం పంపిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను వేల కోట్ల రూపాయిలను రాష్ట్ర ప్రభుత్వం దొంగలించి తన స్వంత పథకాలకు, అవసరాలకు దారి మళ్ళించి వాడు కుందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. అంతేకాక గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయా లను, గృహసారధులను, సచివాలయ కన్వీనర్లును కొత్తగా ప్రవేశపెట్టి మా పంచాయతీల, సర్పంచ్‌ల హక్కులు, అధికారాలు, విధులు, భాధ్యతలను హైజాక్‌చేసి పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. గ్రామ స్వరాజ్య సాధన కోసం 12,918 సర్పంచ్‌లు మంతా పార్టీలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయితీరాజ్ ఛాంబర్‌ల సంయుక్త ఆద్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున అనేక రకాలుగా ఆందోళనలు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే మా 16 డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని, ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి మా డిమాండ్లను పరిష్కరించాలని అచ్చెన్నాయుడుకు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గరిమెళ్ళ వారసులు ల్యాప్ ట్యాప్‌ల వితరణ

విశాలాంధ్ర-పోలాకి : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఘనకీర్తి గల గరిమెళ్ళ సత్యనారాయణ కళాశాలకు రెండు ల్యాప్ ట్యాప్‌లు గరిమెళ్ళ వారసులు వితరణ చేసినట్లు గరిమెళ్ళ ట్రస్ట్ కార్యదర్శి బాదనరాజు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గరిమెళ్ళ ట్రస్ట్ కార్యదర్శి బాదన రాజు మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు ట్రస్ట్ ప్రతినిధులు ఆధ్వర్యంలో అందజేసినట్లు తెలిపారు. హైదరాబాదులో నివాసం ఉంటున్న గరిమెళ్ళ సత్యనారాయణ మేనల్లుడు, విశ్రాంత ఉద్యోగి డాక్టర్ ఈ.వి.రఘునాథరావు సమకూర్చిన రెండు ల్యాప్ ట్యాప్‌లను ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రిన్సిపాల్ జి.నాగేంద్రశర్మకి వారు అందజేశారు. ఈ సందర్భంగా గరిమెళ్ళ ట్రస్ట్ కార్యదర్శి బాదన రాజు మాట్లాడుతూ గరిమెళ్ళ సత్యనారాయణ పేరిట ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధిలో గరిమెళ్ళ వారసులు భాగస్వామ్యం కావడం అభినంద నీయమన్నారు. కళాశాల అవసరాల కోసం సహృదయంతో డాక్టర్ ఈ.వి.ఆర్.రావు వ్యక్తిగతంగా ల్యాప్ ట్యాప్‌లు అందించారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రానున్న ఇంటర్మీడియట్ పరీక్షలలో మంచి ఉత్తీర్ణతా శాతం సాధించి కళాశాల పేరు ప్రఖ్యాతలు ఇనుమడింపజేయాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.నాగేంద్ర శర్మ మాట్లాడుతూ కళాశాల పురోభివృద్ధిలో సహకరిస్తున్న గరిమెళ్ళ వారసులు, గరిమెళ్ళ ట్రస్ట్ సేవలు హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లావేటి కృష్ణారావు, ట్రస్ట్ కోశాధికారి దుబ్బ. కోటేశ్వరరావు, సభ్యులు టి.కిరణ్ కుమార్, కె.శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు కె.అప్పన్న, కె.లక్ష్మి, టి.రాజమోహిని, జె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలా?

తీరు సరికాదన్న ఆర్‌డిఓ భరత్‌నాయక్

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట మండలం జింకిభద్ర పంచాయతీలో నీలకంఠ సాగరంలో ఇటీవల అనుమతులు లేకుండా అక్రమంగా జరిపిన మట్టితవ్వకాలపై పలాస ఆర్‌డిఓ భరత్‌నాయక్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విశాలాంధ్ర పత్రికలో బుధవారం ఇష్టారాజ్యంగా మట్టి దోపిడీ శీర్షికన ప్రచురితమైన కథనానికి పలాస ఆర్‌డిఓ భరత్‌నాయక్‌తో పాటు సోంపేట తహశీల్దార్ కె.విజయ్‌కుమార్, ఇరిగేషన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సూర్యకుమార్‌లు స్పందించారు. ఈమేరకు గురువారం నీలకంఠ సాగర్‌ను పరిశీలించారు. నీలకంఠ సాగర్ నుంచి భారీస్థాయిలో మట్టిని తరలించి మెయిన్‌రోడ్డు పక్కనే ప్రైవేట్ లేఅవుట్ అభివృద్ధికి తరలించడం వల్ల స్థానిక అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేవని రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు. నాళా ట్యాక్స్ కూడా చెల్లించలేదని తెలిపారు. లేఅవుట్‌కు అనుమతులు కోరితే యధావిధిగా ఇక్కడ నుంచి మట్టిని తీసుకెళ్లి చెరువులో వేస్తే తప్పా అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. ఇదిలా ఉండగా జింకిభద్ర సర్పంచ్ ప్రతినిధి తామాడ చంద్రశేఖర్ రైతుల వ్యవసాయం కోసమే తప్పా లేఅవుట్ కోసం మట్టి తరలించలేదని వివరణ ఇచ్చారు. స్థానిక అధికారుల అనుమతులు ఇవ్వకుండా చెరువులో మట్టి ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ఇలా అయితే అధికారులు ఇక్కడ ఎందుకు పని చేయాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సాగరంలో నీరు నిల్వ ఉండేందుకు కొంత లోటు చేయడం అవసరమని సాగర్ దిగువ ఉన్న పొలాలు మట్టితో ఎత్తు చేయకపోతే పంటలు పండించడం కష్టమని చెప్పడంతో రైతులు సమస్య విన్న ఆర్‌డిఓ వ్యవసాయం కోసం అయితే మట్టి తీసుకు వెళ్లవచ్చని సూచించారు. కమర్షియల్ అవసరాలకైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైసీపీ అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమైపోతాయి : టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-గార : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే పల్లెలు శిథిలమైపోతాయని, గ్రామీణ ప్రాంత ప్రజలు నాశనం అయిపోతారని స్థానిక ప్రజాప్రతినిధులు అన్యాయమైపోతారని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ అన్నారు. గ్రామాల అభివృద్ధికై సర్పంచ్ల సమర శంఖారావంలో భాగంగా గురువారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన సర్పంచులు పాల్గొన్నారు. 12,918 గ్రామాలలో ప్రజలు మూడు కోట్ల 50 లక్షల మంది తీవ్ర అన్యాయాన్ని గురువు తున్నారని ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారని అసమర్థులు చేతకాని వాళ్లు అధికారంలో ఉంటే పరిస్థితి ఇలా ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ మాట్లాడుతూ ఎన్నాళ్లుగా పోరాటం చేస్తున్న 16 సమస్యలు పరిష్కారం కాలేదని గత మూడేళ్లుగా గ్రామాల్లో ఏమి చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులు వేల కోట్ల రూపాయలు దారి మళ్లించిందని సొంత పథకాలకు వాడుకున్నారని విమర్శించారు. గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయాలను పంచాయతీల విలీనం చేయాలని, గత మూడు సంవత్సరాలుగా అనేక ఉద్య మాలు చేసిన ప్రభుత్వం ఏమాత్రం స్పందించలేదని శంకర్ వాపోయారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ఓడించడమే లక్ష్యమన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిం చలేక సర్పంచులు ఉత్సవ విగ్రహాలు లాగా మారిపోయారని ఇది ప్రభుత్వ అసమర్థతని అందువల్ల పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందని శంకర్ పేర్కొన్నారు. నిరసన సమయంలో పోలీసులు అడ్డగించడంతో ఒకింత గందరగోళం నెలకొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్య క్షులు లక్ష్మి ముత్యాలరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి బిరు ప్రతాపరెడ్డి, చుక్క ధనుంజయయాదవ్, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు అనేపు రామకృష్ణ, సర్పంచ్ల సంఘం ఆర్గనైజ్ సెక్రెటరీ విన్నింటి వెంకట బానోజీ నాయుడు, రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి భోగాది అప్ప లనాయుడు, జనసేన సర్పంచ్ గోవిందరెడ్డి, రైతు శ్రీనివాస రావు అధికారి ప్రతినిధి, శ్రీకాకుళం నియోజకవర్గ సర్పంచ్ సంఘం అధ్యక్షులు కొంక్యాన ఆదినారాయణ, సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు రుప్ప లక్ష్మి రమణమూర్తి, పలువురు సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయి

మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి

విశాలాంధ్ర-కవిటి: ఉద్యోగ సమయంలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయం మజ్జి అన్నారు.ఈ మేరకు గురువారం మండలంలోని బి.గొనపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం టి.ఖగేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం ఇన్చార్జి హెచ్ఎం బాబురావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు హెచ్ఎం ఖగేశ్వరరావు దంపతులకు ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి ధనంజయం మజ్జి మాట్లాడుతూ ఉత్తమ విద్యాబోధనలు అందించిన ఉపాధ్యాయుడు విద్యార్థుల మనస్సులో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. ఉపాధ్యాయునిగా నాలుగు దశాబ్దాల పాటు సుదీర్ఘ సేవలందించిన ఖగేశ్వరరావు సేవలు మరువలేనివని అన్నారు.తన విద్య బోధనలతో ఎంతోమంది ఉత్తమ విద్యార్థులకు అందించారని అన్నారు.ఉత్తమ బోధనలు అందించి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు.నాడు నేడు పనులు చేపట్టడంలోను, సకాలంలో నిధులు వినియోగించడం లోను, బిల్లులు సమర్పించడంలోను ఆయన ముందంజలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు పిరియా కృష్ణారావు, పాఠశాల స్థలదాత వెంకటేశం, ఎస్ఎంసి చైర్మన్ సర్వేశ్వర రావు, అభివృద్ధి కమిటీ చైర్మన్ వేణు, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు బి.మల్లేశ్వర రావు, ఎస్.రామకృష్ణ, హెచ్ఎం ఖగేశ్వరరావు కుటుంబసభ్యులు, బి.గొనప పుట్టుగ జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ ఉద్యోగి రత్నం పదవీ విరమణ

- డ్రైవర్ పోస్టుకే వన్నెతెచ్చిన రామరత్నం
- జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. చెన్నకేశవరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : డ్రైవర్ పోస్టుకే రామరత్నం వన్నెతెచ్చారని సమాచార పౌర సంబంధాల అధికారి కె. చెన్నకేశవరావు చెప్పారు. గురువారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార శాఖలో గత 34 సంవత్సరాల 5 నెలలు డ్రైవర్ గా సేవలందించిన తంపటాపల్లి రామరత్నం పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ రోజు ఎంతో ప్రత్యేకం, ఉద్వేగభరితమన్నారు. పేరులోనే రత్నం కలిగిన వ్యక్తి దశాబ్దాలుగా చాలా జ్ఞాపకాలను తమ కార్యాలయంలో వదిలి వెళ్ళడం బాధను కలిగిస్తున్నా ప్రతి ఉద్యోగికి ఇలాంటి రోజు ఒకటి వస్తుందని దానిని ఆహ్వానించక తప్పదని వివరించారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే రత్నం లాంటి డ్రైవర్లు చాలా అరుదుగా కనిపిస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పౌర సంబంధాల అధికారి బాలమాన్ సింగ్ మాట్లాడుతూ కార్యాలయంలో అందరూ రత్నం అన్నయ్య అని పిలిచే ఆప్తులను ఆయన ఎక్కువ మందిని సంపాదించు కున్నారన్నారు. పనిలో ఒక్క రోజు కూడా విసుగు, అలసట కనిపించకుండా ఎంతో ఓర్పు సహనం పాటించే వ్యక్తిగా రత్నం ముందు వరుసలో ఉంటారని అన్నారు. అతని బాధ్యతల నిర్వహణలో కుటుంబ సభ్యులు అందించిన సంపూర్ణ సహాయ సహకారాలే అందుకు కారణమని అభినందించారు. డివిజనల్ పౌర సంబంధాల అధికారి నత్తల రాజు మాట్లాడుతూ డ్రైవర్ రామరత్నం సమాచార పౌర సంబంధాల శాఖలో చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. శాఖలో విశేష సేవలందించి అధికారులు మన్ననలు పొందినట్లు తెలిపారు. మంచికి మారు పేరుగా డ్రైవర్ రామరత్నమని, కరోనా సమయంలో విశేష సేవలందించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జర్నలిస్టు మిత్రులు సూర చంద్రశేఖరరావు, పిఆర్వో ఎస్.వి.సత్య ప్రసాద్, ఏవీఎస్ మురళీ, సీనియర్ అసిస్టెంట్ కేశ్వరమ్మ, ఏఐఈలు అప్పలనాయుడులు శాఖ లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డ్రైవర్ రామరత్నంను కార్యాలయ ఉద్యోగులంతా పూలదండలు, పుష్ప గుచ్చాలు, దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. రత్నంతో తమకున్న ప్రత్యేక అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఐఈ కె. పుణ్యవతి, టైపిస్టులు నిమ్మల దాలమ్మ, రాధారాణి సాహు, ఉమామహేశ్వరరావు, డ్రైవర్ శాస్త్రి, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసరావు, శిమ్మమ్మ, భూదేవి, రాంభాయ్, టి. సుజాత, యు. గోవిందరావు, యు. శ్రీనివాస్ పట్నాక్, టి. సంతోష్ , టి. రాజశేఖర్, టి. దివ్య, టి. సౌందర్య సింధూవీడియో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి అతని వెంట నడుస్తున్నానని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధన రెడ్డి అన్నారు. గిట్టని వ్యక్తులు రాజకీయ లబ్ధికోసం చేస్తున్న ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసారు. తన నా ఊపిరి ఉన్నంత వరకు ప్రతి అడుగు పవన్ కళ్యాణ్‌తోనే అని స్పష్టం చేసారు. ఇక్కడి అసెంబ్లీ టిక్కెట్టును జనసేనకు కేటాయించకపోయినా, ఉమ్మడి అభ్యర్థి గెలుపుకు ఎటువంటి అరమరికలు లేకుండా కృషి చేస్తామని అన్నారు. అధినేత తీసుకున్న నిర్ణయం రాష్ట్ర ప్రజల భవిషత్తుకు ఓ చక్కని మార్గం అని నమ్ముతున్నామని, రాష్ట్రంలో ఖచ్చితంగా జనసేన-తెలుగుదేశంల ప్రభుత్వం ఏర్పాటు జరుగుతుందని అన్నారు. ఇద్దరు యోధులతో కలిసి పోరాటం జరగుతుందని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని, అధికార పార్టీ ఒత్తిళ్ళ ప్రలోభాలకు దూరంగా ఉండాలని కోరారు.

ఘనంగా అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పట్టణంలో నర్మదేశ్వరాలయంలో ఎదురుగా కొత్తగా నిర్మించిన అభయ ప్రసన్నాంజనేయ విగ్రహ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ ఉపాసకులు బ్రహ్మశ్రీ పెంటా శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో బుధవారం ఆలయం వద్ద నుండి విగ్రహాలను ఊరేగించి, గురువారం ఉదయం పంచామృతం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకించి పూజలు జరిపారు. ప్రాత:కాల పూజ, కళాన్యాస హోమం, యంత్ర స్థాపన, శోడషోపచార పూజ, అలంకరణ, మహా పూర్ణాహుతి, దర్పన దర్శనం తదితర ఆచారాలను నిర్వహించారు.

నియమావళి అమలుకు సిద్ధం కావాలి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గురువారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన దొర పట్టణంలో పర్యటించి, పలు పోలింగ్ బూతలను సందర్శించి అక్కడ మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం తహశిల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ భరత్‌నాయక్‌తో కలిసి నియోజకవర్గ పరిధి తహశిల్దార్లు, మున్సిపల్ కమీషనర్, ఎమ్పీడీఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ రాగానే నియమావళిని పక్కాగా అమలు చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుని మండల స్థాయి అధికారులు సిద్దంగా ఉండాలని కోరారు.

నందిగాం మండలంలో వైకాపాకు షాక్

తెదేపాలో చేరిన పెద్ద బానాపురం సర్పంచ్ పైల ఇందిరమ్మ

విశాలాంధ్ర-నందిగాం: తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో తన అనుచరు లతో తెదేపాలో చేరిన ఇందిరమ్మ సుమారు 100 కుటుంబాలను కండువా వేసి పార్టీలోకి అచ్చెన్నాయుడు ఆహ్వా నించారు. ఈ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాలు రైతులు ఉసురు జగన్మోహన్ రెడ్డి పోసుకున్నారని ఏ గ్రామానికి వెళ్లాలంటే కనీసం రోడ్డు సదుపాయం కూడా కల్పించలేదని విమర్శించారు. కనీసం హిందీ రాని వ్యక్తిని నిలబెట్టారని అన్నారు. జనసేన టిడిపి మధ్యన గొడవలు పెట్టాలని జగన్మోహన్ రెడ్డి చూస్తున్నాడని అన్నారు. మమ్మల్ని అరెస్టు చేయించి ఎన్నో ఇబ్బందులు గురి చేశారు. మేం పూర్తిగా రాజకీయాలు మానుకుంటామని అనుకున్నారని అచ్చం నాయుడు అన్నారు. తప్పు చేస్తే కోసుకుంటాం కానీ నీలా భయపడే వ్యక్తులం మేం కాదని సభ ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాలు మాజీ పిఎస్సిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, జనసెన ఇంచార్చ్ కణితి కిరణ్ కుమార్, నందిగామ మండల అధ్యక్షులు జన సైనికులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా నిర్వహించి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పథకాలన్నీ కేంద్రానివే...

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్రంలో ప్రజలకు మేలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటున్నా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతోనే పథకాలు సాగుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమా మహేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుద్దాల నిర్మలలు అన్నారు. గురువారం పట్టణంలో 23వ వార్డు పరిధి బెల్లుపడా కాలనీ, పాత బస్టాండ్ కూడలిలో ప్రజా పోరు-2 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులను ఉద్దేశించి మాట్లాడుతు కేంద్ర సహాయం లేకుండా రాష్ట్ర పథకాలు లేవని, పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు గమనించి భారతీయ జనతాపార్టీకి తోడుగా ఉండాలని కోరారు. నిరంతరంగా పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని నెల నెలా అందిస్తుంటే, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి బొమ్మలతో ఉండే వాహనాల్లో తిప్పి సరఫరా చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు.

ఇళ్ళ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి



విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : నవరత్నాల పథకంలో భాగంగా పేదలందరికీ పక్కా ఇళ్ళను అందించే కార్యక్రమాన్ని సమర్ధంగా నిర్వహించాలని ఆర్డీఓ భరత్ నాయక్ అన్నారు. గురువారం స్థానికంగా పర్యటించిన ఆయన ఇళ్ళ పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. అర్బన్‌లో ఇంకా 715మదికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉండటాన్ని గుర్తించి రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని కోరారు. ఎన్నికల ఉపతహశిల్దార్ శ్రీహరి, ఆర్.ఐ-2 చూడామణి తదితరులు ఆర్డీఓ సమీక్షలో పాల్గొన్నారు.

కపిధ్వజను ప్రారంభించిన ఎన్ఈఆర్

విశాలాంధ్ర-రణస్థలం : రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కదులుతున్నారు జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), అందులో భాగంగా ప్రచారం నిర్వహించడానికి వీలుగా గురువారం "కపిధ్వజ" అనే ప్రచార రథం ను ప్రత్యేక హెూమాలు, పూజలు వేదపండితుల ఆధ్వర్యం లో నిర్వహించి, శ్రీ మహాలక్ష్మీ తల్లి ఆశీస్సులతో నాయకులు, కార్యకర్తల సందడితో ఘనంగా ఎన్ఈఆర్ ప్రారంభించారు.

కొల్లివలస గురుకులం ఐబి బృందం సందర్శన

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఇంటర్నేషనల్ బాక్లారీయెట్ (ఐ బి) బృందం, (రాష్ట్ర విద్యా పరిశోధన యు శిక్షణా సంస్థ) ప్రొఫెసర్ కేశినేని శ్రీనివాస్, మిషన్ అల్టో (సీనియర్ కరిక్యులం డిజైన్ మేనేజర్ వాషిం గ్టన్ యూఎస్ఏ), మిషర్ మైకేల్ (అసోసి యేషన్ మేనేజర్ అసెస్మెంట్ ఆప రేషన్ ఐబి యుకె కార్డిఫ్) లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం కొల్లివలస ను సందర్శించి పరి శీలించారు. ఐబీ విద్య సిలబస్ ఆంధ్ర రాష్ట్రం లో విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దేశ వ్యాప్తంగా 5000 పాఠశాలల్లో ఈ ఐబీ సిల బస్సు బోధిస్తున్న సందర్భంలో ఆంధ్రప్రదేశ్లోని శ్రీకాకుళం జిల్లాలో ప్రభుత్వ బాలుర పాఠశాల శ్రీకాకుళం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురు కులం కొల్లివలస లు ఐబి సిలబస్ బోధనకు ఎంపికయ్యాయి. విద్యా విధానం మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని కుదుర్చునట్లు అందులో భాగంగానే బృందం కొల్లివలస గురుకులాన్ని పరిశీలించింది. పాఠశాలలో బోధన, అభ్యాస విధానాన్ని పరిశీలించారు. బోదన సమయంలో విద్యా ర్థులతో మమేకమై తరగతి గదిలోనే కూర్చొని పాఠాలు విన్నారు. అలాగే విద్యార్థులతో బోద న అంశాలపై చర్చించి తెలుసుకున్నారు. లైబ్రరీలో విద్యార్థుల కెరియర్ గైడెన్స్ వివ రాలు పరిశీలించి లైబ్రేరియన్ రామారావుని అభినందించారు. ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేకించి బోదన విధానంపై చర్చించి, ప్రిన్సిపాల్ నూక రామకృష్ణతో కోర్స్ వివరాలు తదితర అంశాలు ప్రగతి నివేదికలు తెలుసు కున్నారు. పాఠశాలలో బోదన అభ్యస విధా నాలను, పిల్లల స్థాయి విధానంపై చర్చించా రు. విద్యార్థులకు కోర్స్ లక్ష్యాలను ప్రభుత్వ ఆశయాలను వివరించి వారి ప్రగతికి ఐ బి కోర్స్ ఎలా దోహదపడుతుందో తెలియ జేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ బృందంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే వెంకటేశ్వరరావు, సర్వ శిక్ష అభియాన్ సీఎంఓ పేడాడ ప్రభాకర్ రావులు వున్నారు.

ఆశీళ్ళ రద్దు తీర్మానం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : పదహారు అంశాల అజెండాతో మున్సిపల్ కమీషనర్ ఎస్.రమేష్ సమన్వయంతో ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. వార్డుల్లో ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పలువురు కౌన్సిలర్లు గొంతెత్తారు. మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచాల్సిన వేలం పాట ద్వారా తగ్గిన ఆదాయానికి పాటలను ఖరారు చేసేలా అంశాన్ని పొందుపర్చడం సరికాదని పలువురు కౌన్సిలర్స్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇటీవల నిర్వహించిన ఆశీళ్ళ వసూలు వేలం పాట రద్దు చేస్తూ మరోసారి వేలం పాటల నిర్వాహణకు తీర్మానించారు. వేలం పాట సమయంలో పాటదారులు కుమ్మక్కవ్వడంతోనే ఆదాయం గత ఏడాదితో పోల్చితే ఆరు లక్షలు తగ్గడం జరిగిందని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. వార్డులకు నీటి సరఫరా చేయడానికి ఐదు లక్షలతో అద్దె ట్యాంకర్ నిర్వాహణకు ఆమోదించారు. పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో కార్యక్రమాలకు ట్యాంకర్ల కోసం సిఫార్సులు చేస్తుండటంతో అన్ని ప్రాంతాలకు సరైన రీతిలో నీటిని అందివ్వలేకున్నామని కమీషనర్ అనడంతో కౌన్సిలర్లు బచ్చు జగన్, వైస్ ఛైయిర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి తదితరులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, అధికారుల కార్ల పెట్రోల్ కోసం లక్షలు ఖర్చు చేస్తుండగా, ప్రజల అవసరాలకు కోసం కౌన్సిలర్లు నీటి ట్యాంకర్ల కోసం సిఫార్సు చేయడం ఏమంత తప్పని ప్రశ్నించడంతో సభలో వాతావరణం వేడెక్కింది. ఛైయిర్‌పర్సన్ కల్గజేసుకుని అన్ని ప్రాంతాలకు నీటిని అందించేందుకు ప్రయత్నిస్తామని సభ్యులు సహకరించాలని కోరారు. వేసవి దృష్టిలో ఉంచుకుని 70వేల ఖర్చుతో రెండు చలివేంద్రాల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది.

'ఆధ్యాత్మిక భావాలను పెంచుకోవాలి'

విశాలాంధ్ర-జలుమూరు: 'ఆధ్యాత్మిక భావాలను పెంచుకోవాలి' ఆధ్యాత్మిక భావాలను ప్రతి ఒక్కరూ పెంచుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ బగ్గు శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జలుమూరు మండలం కొమనాపల్లిలో గురువారం జరిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట మహెూత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ శ్రీనివాస్ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామస్థుల మధ్య ఐక్యమత్యం పెరుగుతుందన్నారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయ పందిర్రాట

విశాలాంధ్ర-జలుమూరు : స్వాతి నక్షత్ర అమృత ఘడియలలో గురువారం ఉదయం 9 గంటలకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుభస్తంభ పందిరిరాట కార్యక్రమం రమ్యంగా నిర్వ హించడం జరిగింది. ఈ శుభ స్తంభ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నేటి నుంచి మహాశివరాత్రి ఉత్స వాలకు ముస్తాబు ప్రారంభిస్తూ జాగర ముందు రోజుకి పూర్తి చేయడం, అదేవిధంగా స్వామి వారిని దర్శించు లక్షలాది భక్తులకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఆటంకాలు అపసృతులు కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయి అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు భూషణ శర్మ, గ్రామ సర్పంచ్ తమ్మన గారి టీ. సతీష్, అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.